ప్రజాశక్తి
బుధవారం 24 జూలై 2024
5
శ్రీకాకుళం



డిప్లమో పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

డిప్లమో పారామెడికల్ కోర్సుల కన్వీనర్ కోటాకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు ఆరో తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కోర్సులకు ఇంటర్ ఏ గ్రూప్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులేనని స్పష్టం చేశారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. తమ కళాశాలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తగు ధ్రువపత్రాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7995013422, 7680945357 ఫోన్ నంబర్లను గానీ జెమ్స్ హాస్పిటల్ క్యాంపస్, రాగోలులో నేరుగా గానీ సంప్రదించాలని సూచించారు.



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

నీట మునిగిన పంటలకు...
నష్ట పరిహారం ఇవ్వాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

వంశధార కుడి కాలువకు గండి పడి నీట మునిగిన వరి పంటకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, నాయకులు వెలమల రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో వంశధార కుడి కాలువకు గండి పడి నీట మునిగిన పొలాలను మంగళవారం పరిశీలించారు. ప్రతినిధి బృందానికి రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ గత పదేళ్లుగా టిడిపి, వైసిపి ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పూడికలు తీయకపోవడం, షట్టర్లు మరమ్మతులకు గురికావడంతో కాలువ పూర్తిగా పాడై కుడి కాలువ గండి పడిందని తెలిపారు. ఇసుకలపాలెం, శ్యామలాపురం, కాగితాపల్లి, వీరభద్రాపురం, లొద్దలపేట, శాస్త్రులపేట గ్రామాలో వరి పంట నీట మునిగిందని చెప్పారు. కుడి కాలువ గండితో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సుమారు 400 ఎకరాల మేర నష్టం వాటిల్లిందని, ఐదు రోజులుగా నీటిలో ఉండడంతో వరి ఎద కుళ్లిపోయిందన్నారు. నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పాడైన పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కౌలు రైతులకూ న్యాయం చేయాలని కోరారు. కాలువలకు షట్టర్లు బిగించి ఆధునీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుసంఘం నాయకులు ధనుంజయ నాయుడు, టి.భాస్కరరావు, సిఐటియు నాయకులు అదపాక రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో తగ్గిన వర్ష నష్టం

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అధికార యంత్రాంగం అప్రమత్తతో జిల్లాలో వర్ష నష్టం అంతగా లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో కంచిలి, కవిటి, మందస, ఎచ్చెర్ల తదితర మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైందని చెప్పారు. జిల్లాలో నాగావళి, వంశధార నదులకు ఎగువ ప్రాంతాల నుంచి ఐదు వేల క్యూసెక్కుల వరకు నీరు వచ్చిందని తెలిపారు. నదుల వల్ల ఎక్కడా ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు. కాలువల వద్ద లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వరి పంట పొలాలు సుమారు 150 ఎకరాల వరకు ముంపునకు గురైందని సమాచారం వచ్చిందని, దీన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. ఆరు ఇళ్లు దెబ్బతిన్నట్లు నివేదికలు వచ్చాయన్నారు. అనేకచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని, విద్యుత్ శాఖకు సుమారు రూ.ఐదు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు వివరించారు. పలుచోట్ల కరెంటు స్తంభాలు దెబ్బతిన్నాయని, వాటిని మార్చాల్సి ఉంటుందన్నారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయడం వల్ల ఎక్కడా మానవ, పశునష్టం లేదన్నారు. మత్స్యకారులను సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని సూచించినట్లు చెప్పారు.

పరిశుభ్రతపై దృష్టిసారించాలి

ప్రతి మంగళ, శుక్రవారాలు యాంటీ లార్వా కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లో శుభ్రతా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి శుక్రవారం ప్రతి ఇంటినీ శుభ్రపరిచే కార్యక్రమంలో భాగంగా సచివాలయ, మలేరియా నివారణ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మలేరియా, డెంగీ తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లలో ఫ్రిజ్‌లకు వెనుక భాగంలో ఉండే బాక్స్, కూలర్లు, ఇంటిపై, ఇంటి బయట పనికిరాని వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. మలేరియా, డెంగీ కారక దోమలు మురుగు కాలువల్లోనే కాకుండా మంచినీరు, వర్షపు నీటిలోనూ జన్మిస్తాయని చెప్పారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలు కొనసాగుతున్నందున కాచిన నీటిని తాగాలన్నారు.


ప్రభుత్వం దృష్టికి పంట నష్ట వివరాలు

ప్రజాశక్తి - పొందూరు



లక్ష్మీపేటలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జెడి శ్రీధర్

జిల్లాలో వర్షాల కారణంగా ముంపునకు గురై నష్టం వాటిల్లిన పలు పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ తెలిపారు. మండలంలోని తాడివలస, పెనుబర్తి, లక్ష్మీపేట గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా జిల్లాలో పలుచోట్ల వరి, మొక్కజొన్న ఇతర పంటలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. నీట మునిగిన పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారులు తెలియజేసిన సూచనలను రైతులు పాటించాలన్నారు. ఆయన వెంట ఎడిఎ వి.శ్రీనివాసరావు, డిఆర్‌సి ఎడిఎ సిహెచ్.వెంకటరావు, ఎంఎఒ ప్రియాంక, ఎఒ బెండి బాబ్జీ, విఎఎలు తదితరులు పాల్గొన్నారు.



అయినా అదే తీరు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ సిక్కోలువాసులను తీవ్ర నిరాశ పరిచింది. తెలుగుదేశం పార్టీ మద్దతుపై ఆధారపడి కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం, ఈసారి బడ్జెట్‌లో కాస్తయినా ప్రాధాన్యమిస్తుందని జిల్లావాసులు ఆశించారు. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీరు మారలేదు. బడ్జెట్ కేటాయింపు విషయంలో అటు రాష్ట్రానికి, ఇటు జిల్లాకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కలేదు. విభజనతో నష్టపోయిన ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని ఇవ్వాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తుంటే, దాన్ని పక్కనపెట్టి గ్రాంట్ రూపంలో సాయమందిస్తామని పేర్కొనడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. జిల్లాకు సంబంధించి రైల్వే లైన్ల అభివృద్ధి తప్ప కొత్త ప్రాజెక్టులు, కొత్త రైళ్లేవీ కేటాయించకపోవడం మరింత నిరాశకు గురిచేసింది. మొత్తమ్మీద కేంద్ర బడ్జెట్ అన్ని తరగతులనూ అసంతృప్తికి గురిచేసింది.

- టిడిపి మద్దతు ఉన్నా ఒరవడి మారలే
- సిక్కోలు వాసుల ఆశలపై నీళ్లు చల్లిన కేంద్రం
- బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి
- ప్యాకేజీ పక్కనపెట్టి జిల్లాకు గ్రాంట్ రూపంలో సాయం
- ప్రస్తావన లేని రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధి అంశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 3.90 లక్షల మంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో కలిపి ఆరు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని 2014లోనే బిజెపి ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు అమలు కాలేదు. మద్దతు ధరలకు గ్యారంటీ చట్టం చేయాలని రైతులు చాలాకాలం నుంచి డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో దాని ప్రస్తావనా లేదు. కిసాన్ సమ్మాన్ నిధి సాయం పెంచుతారని రైతులు ఆశలు పెట్టుకున్నా నిరాశే మిగిలింది. పంటలకు మద్దతు ధరలను గత నెల పెంచామని చెప్పింది గానీ ధరల గ్యారంటీ చట్టం చేస్తామని ఎక్కడా చెప్పలేదు. ఖరీఫ్‌లో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విధానంలో పంటల సర్వే చేయనున్నట్లు ప్రకటించింది. ఉద్యాన పంటల్లో 109 రకాల అధిక దిగుబడి రకాలతో పాటు వాతావరణ మార్పులను తట్టుకునే 32 రకాల ఉద్యాన పంటలను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఉద్యాన పంట ఉత్పత్తుల సేకరణ, నిల్వ, మార్కెటింగ్ కోసం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్, సహకార సంఘాలను ప్రోత్సహించనున్నట్లు పేర్కొంది.

ప్యాకేజీని పక్కన పెట్టి గ్రాంట్ రూపంలో సాయం

రాష్ట్ర విభజన చట్టం హామీల్లో భాగంగా వెనుబడిన జిల్లాలకు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున కేటాయించాల్సి ఉంది. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు, రాయలసీమలోని నాలుగు జిల్లాలకు ఈ నిధులు కేటాయించాల్సి ఉంది. 2015 నుంచి 2018 వరకు ప్రతి ఏడాది రూ.50 కోట్లను కేటాయించిన కేంద్ర ప్రభుత్వం, 2018 నుంచి ఆ నిధులను ఆపేసింది. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు వెనుకబడిన ప్రాంత ప్యాకేజీ కింద రాయలసీమలోని నాలుగు జిల్లాలు, శ్రీకాకుళంతో సహా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు గ్రాంట్ల రూపంలో సాయం అందించనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని అంతా కోరుతున్నా, గ్రాంట్ రూపంలో సాయమందిస్తామంటూ బడ్జెట్‌లో పేర్కొనడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధికి కేటాయింపులు అంతంతమాత్రమే



వ్యవసాయ పనుల్లేని సీజన్‌లో వ్యవసాయ కార్మికులు, కూలీలకు కాస్త కూస్తో పనులు కల్పించి ఊతమిస్తున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి స్వల్పంగా కేటాయింపులు పెరిగాయి. 2023-24 బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు కేటాయించగా, 2024-25 బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించారు. జిల్లాకు ఆమేరకు స్వల్పంగా నిధులు కేటాయింపు పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 7.32 లక్షల మందికి జాబ్‌కార్డులు జారీ చేయగా 6.07 మంది కూలీలు పనుల్లోకి క్రమం తప్పకుండా వస్తున్నారు. వీరందరికీ పనులు కల్పించాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం కేటాయించిన నిధులు సరిపోవని అధికారులు భావిస్తున్నారు. దీంతోపాటు మౌలిక వసతుల కల్పనపైనా ప్రభావం చూపనుంది.

వినపడని రైల్వే కూత



రైల్వే బడ్జెట్ అనగానే కొన్ని నెలల ముందు నుంచీ అంతా ఆసక్తిగా ఎదురుచూసేవారు. మన ప్రాంతానికి ఏమైనా కొత్త రైళ్లు వేస్తున్నారా? గతంలో ఇచ్చిన మోడల్ స్టేషన్ల హామీ కార్యరూపం దాలుస్తుందా? రైళ్లకు అదనపు హాల్టులు కల్పిస్తున్నారా? అసలు ఏం ప్రకటిస్తారోనని ప్రజలు ఉత్కంఠగా చూశారు. ముఖ్యంగా విశాఖ రైల్వేజోన్‌పై ఏదైనా ప్రకటన వస్తుందని అంతా ఆశించారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రైల్వేపరంగా జిల్లాకు మొండిచేయి చూపింది. కొత్త రైళ్లు లేకపోగా జిల్లా మీదుగా వెళ్తూ ఆగకుండా వెళ్తున్న రైళ్లకు హాల్టులు కూడా దక్కలేదు. రైళ్ల పొడిగింపు, స్టేషన్ల అభివృద్ధి ప్రస్తావనే లేదు.

వేతనజీవులకు నిరాశే

పన్నుల విషయంలో ప్రస్తుత బడ్జెట్‌లోనూ ఉద్యోగులకు నిరాశే మిగిలింది. ప్రస్తుతమున్న ఆదాయపన్ను పరిమితిని రూ.మూడు లక్షల నుంచి రూ.నాలుగు లక్షలకు ప్రభుత్వం పెంచుతుందని ఉద్యోగులు ఆశించినా అది నెరవేరలేదు. ఆదాయపన్ను పరిమితి స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50 వేలు నుంచి రూ.75 వేలకు పెంచింది. పన్నుల శ్లాబుల్లో కొంత మార్పులు చేసింది. ఏడాదికి రూ.17,500 ఆదా అవుతుందని బడ్జెట్‌లో పేర్కొనడంపై ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.

పిఎంఎవై గృహాలు మళ్లీ మంజూరు

ప్రధానమంత్రి గృహ ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా మరో మూడు కోట్ల ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రకటించారు. జిల్లాకు సమారు ఆరు వేల వరకు కొత్త ఇళ్లు మంజూరవుతాయని అధికారులు చెప్తున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలకే ప్రస్తుతం దిక్కు లేకుండా పోయింది. 2021-22లో జిల్లాకు 3,751 ఇళ్లు మంజూరు కాగా, అందులో ఇప్పటివరకు 561 ఇళ్లే పూర్తయ్యాయి.

కొత్త పరిశ్రమల ఏర్పాటుకేదీ ప్రోత్సాహం

జిల్లాలో పదేళ్లుగా కొత్తగా ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించినా అవి వచ్చే పరిస్థితి లేదు. పరిశ్రమల ఏర్పాటుకు పన్నుల చెల్లింపుల్లో మినహాయింపు, వర్కింగ్ కేపిటల్‌లో మూడు శాతం రాయితీ, పరిశ్రమలకు 50శాతం విద్యుత్ రాయితీ వంటి సౌకర్యాలు ప్రత్యేక హోదాతోనే సమకూరుతాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించడంతో పరిశ్రమల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో ఉపాధి కోసం జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు కొనసాగే పరిస్థితులే తటస్థించనున్నాయి.

రాష్ట్ర ప్రయోజనాలకు పెద్దపీట



రాష్ట్ర ప్రజలు ఎంతో నమ్మకంతో ఎన్‌డిఎ కూటమిని గెలిపించారు. వారి ఆశలకు తగ్గట్టుగానే ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలకు కేంద్ర బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. బడ్జెట్ కేటాయింపులతో అభివృద్ధి పరుగులు తీయనుంది. అమరావతికి రూ.15వేల కోట్ల కేటాయింపు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విశాఖ ఉక్కుకు రూ.620 కోట్లు కేటాయింపుతో ప్రజల్లో ఆశలు చిగురించాయి.

\- కలమట వెంకటరమణ, టిడిపి జిల్లా అధ్యక్షులు

నిధుల కేటాయింపులో నిరాశ



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోనూ అధికారంలో ఉండడంతో రాష్ట్రానికి ఇప్పుడైనా భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలుకు నిధులు కేటాయిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రజలను మోసగించడానికి కేంద్రం ప్రయత్నించింది. రాజధాని అమరావతికి 15 వేల కోట్ల రూపాయలు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని మంత్రి పేర్కొనడం వల్ల రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదు. రూ.15 వేల కోట్లు నేరుగా గ్రాంట్‌గా ప్రకటించాలి. పలు సంస్థల ద్వారా అప్పుగా ఇప్పించడం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుంది.

\- డి.గోవిందరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి

కార్మిక వ్యతిరేక బడ్జెట్



కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలను ముఖ్యంగా కార్మిక వర్గాన్ని నిరాశపరిచింది. ఏటా కోటి మందికి ఉపాధి కల్పించేందుకు మూడు పథకాలు ప్రవేశపెట్టామని ఆర్థిక మంత్రి గొప్పగా చెప్పినా, వాస్తవంగా ఈ పథకాలు ఉపాధి పెంచేవి కావు. కొత్తగా ఉద్యోగం ఇచ్చిన యజమానులకు మొదటి నెల జీతాన్ని తిరిగి చెల్లిస్తామని, యజమానులు చెల్లించాల్సిన ఇపిఎఫ్ వాటాను ప్రభుత్వం మరికొంత కాలంపాటు చెల్లిస్తుందని చెప్పడం వెనుక యజమానులకు దోచిపెట్టే పథకాలుగా ఉన్నాయన్నారు. ఇపిఎస్ పెన్షనర్లు తమ కనీస పెన్షన్ పెంచాలని చాలాకాలం నుంచి పోరాడుతున్నా బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి ఉపయోగపడే జాతీయ ఆరోగ్యమిషన్, ఐసిడిఎస్, సమగ్ర శిక్షా అభియాన్, మధ్యాహ్న భోజనం, ఆయుష్మాన్ భారత్ తదితర కేంద్ర పథకాలకు కేటాయింపులు పెంచలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను విరమిస్తూ ప్రకటన చేయలేదు.

\- పి.తేజేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

కె.ఆర్ స్టేడియం పనులు వేగవంతం

- ప్రతిరోజూ పురోగతిపై చెప్పాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించి, వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కోడి రామ్మూర్తి మైదానం నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. వర్షం కారణంగా పనులు ఇంకా ప్రారంభించలేదని కాంట్రాక్టర్ కలెక్టర్‌కు వివరించారు. పనులకు సంబంధించి ఏ మెటీరియల్ ఎక్కడ నుంచి వస్తుందీ తెలియజేయాలని ఎఇఇ పి.టి రాజును ఆదేశించారు. కార్మికులు ఒడిశా నుంచి వస్తున్నట్లు చెప్పగా, వారికి సంబంధించిన ప్రయాణ వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్ద వర్షం పడితే తప్ప పనులు ఆపకూడదని స్పష్టం చేశారు. ఈ భవనంలో ఏ ఏ పనులు జరుగుతాయని ఆయన అడగ్గా సీలింగ్ ప్లాస్టింగ్, బ్రిక్ వర్క్స్ ఉందని, భవనంపై మరో ఫ్లోర్ వేస్తామని ఆర్ అండ్ బి ఎస్ఇ జాన్ సుధాకర్ ఆయనకు వివరించారు. ప్లాస్టింగ్, బ్రిక్ వర్క్ పనులకు నెల రోజులు పడుతుందని ఎఇఇ చెప్పారు. ఇసుక, ఇటుక, సిమెంట్ ఎంత అవసరమో తెలియజేయాలన్నారు. ప్రతిరోజూ ఏ పని ఎంత జరుగుతుందో తెలియజేయాలని డిఇఇ గణపతిరావును ఆదేశించారు. పనులు త్వరితగతిన నాణ్యతతో చేపట్టాలని సూచించారు. టాయిలెట్లు, ఎంట్రన్స్, తదితర ప్లాన్ అందజేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతానికి అవసరమైన జిమ్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాలని డిఎస్‌డిఒ శ్రీధర్‌ను ఆదేశించారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు నిర్మాణ పనులపై చర్చించారు. పరిశీలనలో ఆర్ అండ్ బి ఇఇ ఎస్.రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



జెసి నవీన్‌ను సత్కరిస్తున్న జిల్లా అధికారులు

జెసిగా జిల్లాపై చెరగని ముద్ర

నవీన్‌కు అధికారుల ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాయింట్ కలెక్టర్‌గా ఎం.నవీన్ జిల్లాపై చెరగని ముద్ర వేశారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. బదిలీపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్‌కు జిల్లా అధికారులు, రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అతి ముఖ్యమైన మూలపేట పోర్టు భూసేకరణ, రీ సర్వే, ధాన్యం సేకరణలో ఆయన మంచి పనితీరు కనబరిచారన్నారు. అన్నింటికంటే ముఖ్యమైన ఎన్నికల నిర్వహణలో ప్రతిభావంతుడైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. మంచి ప్రణాళికతో, సరైన తీరులో మెరుగైన సామర్థ్యం కలిగిన అధికారిగా, వ్యక్తిగా ఉండి మంచి సూచనలు, సలహాలు ఇచ్చేవారని చెప్పారు. సిఆర్‌డిఎకు ఆయన సేవలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

బదిలీపై వెళ్తున్న జెసి నవీన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తోడ్పాటు అందించిన అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎక్కడ పనిచేసినా శ్రీకాకుళం జిల్లా ఎప్పుడూ ప్రత్యేకమేనన్నారు. కోవిడ్ సమయంలో జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. జిల్లాలో పనిచేయడం గొప్ప అనుభూతిని మిగిల్చిందన్నారు. పలువురు అధికారులు జెసితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఆర్‌డిఒలు భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

- విస్తృత తనిఖీలు నిర్వహించాలి
- అక్రమ రవాణాను అరికట్టాలి
- ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అసాంఘిక కార్యకలాపాలు సాగే ప్రదేశాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జనాభా, భూ నైసర్గిక స్వరూపం, సరిహద్దు ప్రాంతాలు, జాతీయ రహదారి, సముద్ర తీర ప్రాంతం, శాంతిభద్రతల సమస్యలు, నేరాల నమోదు, నేర ప్రవృత్తి తీరు, సమస్యాత్మక గ్రామాలు, ట్రబుల్ మ్యాంగర్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ పోలీస్‌స్టేషన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి గంజాయి, నాటుసారా, మద్యం వంటి అక్రమ రవాణా అరికట్టాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించి ప్రజలకు నిష్పక్షపాతమైన సేవలందించాలని సూచించారు. ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదుపై సమగ్రమైన విచారణ చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నమోదైన ఎన్నికల కేసులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించి గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. తరచూ నేరాలు జరుగుతున్న ప్రదేశాలు, ప్రాంతాలు గుర్తించి గస్తీలు విస్తృతం చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల దర్యాప్తు వేగవంతం పూర్తి చేయాలన్నారు. స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో కనీస మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్‌పిలు జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు, డిఎస్‌పిలు బాలచంద్రారెడ్డి, శృతి, త్రినాథరావు, నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరవు, ఎఒ గోపీనాథ్, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఐద్వా నాయకులు

మహిళలకు లక్ష్మీసెహగల్ ఆదర్శం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మహిళల ఆర్థిక, సామాజిక రాజకీయ సమానత్వానికి మాజీ రాజ్యసభ సభ్యులు లక్ష్మీసెహగల్ కృషి చేశారని ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాస్టల్‌లో ఆమె చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తిరీత్యా వైద్యులైనా దేశాన్ని విముక్తిబాటలో నడపాలని, ఆజాద్ హింద్ ఫౌజ్ దళంలో చేరి ఒక ఉన్నత శిఖరాలను అధిరోహించారని కొనియాడారు. రాజకీయవేత్తగా, వైద్యులుగా, హక్కుల కార్యకర్తగా ప్రజానీకానికి విశేష సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నగర కన్వీనర్ శ్రీదేవిపాణిగ్రహి, ఎస్ఎఫ్ఐ బాలిక కన్వీనర్ పి.పవిత్ర, ధనలక్ష్మి, జ్ఞానేశ్వరి, కవిత, స్వప్న పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

మంత్రి సవితను కలిసిన శంకర్

శ్రీకాకుళం అర్బన్ : వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి మంత్రి ఎస్.సవితను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, వెనుకబడిన తరగతుల వసతిగృహాలు దయానీయ పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు, మరమ్మతులు చెప్పట్టాల్సి ఉందన్నారు. అలాగే సిబ్బంది కొరత వెంటాడుతోందని వివరించారు. విద్యుత్ సమస్యలను అధిగామించేందుకు సోలార్ సిస్టం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సొంత భవనాలు లేని హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. మెనూ ఛార్జిలను పెంచాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థనపై మంత్రి సానుకూలంగా స్పందించాని ఎమ్మెల్యే తెలిపారు.

జవాన్ రాజేష్‌కి నివాళి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, వీర జవాన్ రాజేష్‌కు విద్యార్థులు ఘనంగా నివాళ్లర్పించారు. ఇటీవల కాశ్మీరులో ఉగ్రవాదులతో పోరాడుతూ వీరమరణం పొందడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ముందుగా రాజేష్ చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి, మౌనం పాటించారు. అనంతరం గ్రామంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రాజేష్ వీరమరణం ఆదర్శనీయమని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వీరభద్రరావు కొనియాడారు. ఆయన కుటుంబానికి సంతాపాన్ని ప్రకటించి అండగా ఉంటామని ధైర్యం ఇచ్చారు. కార్యమములో ఉపాధ్యాయులు భాస్కరరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, కష్ణవేణి, మార్కండేయులు, రోజా పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసిరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో సిడిపిఒ ఝాన్సీ అధ్యక్షతన మంగళవారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. పోష్ యాక్టు (పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ చట్టం), అంతర్గత కమిటీల ఏర్పాటు, అవి పని చేసేతీరు, వాటి విధానాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం కల్పించిన ప్రత్యేక చట్టాలను తెలుసుకున్నప్పుడే వివక్షను ఎదుర్కోగలిగే ధైర్యం వస్తుందన్నారు. న్యాయ సేవా సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సహాయాలను పొందాలని సూచించారు. గృహహింస, వరకట్న వేధింపులు నియంత్రణకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత సంస్థ యజమానులు, క్షేత్రస్థాయిలో పనిచేసే వారిపై ఉందన్నారు. మహిళలకు అన్యాయం జరిగినప్పుడు ఆమె తరుపున పోరాడి అండగా నిలవాలని సూచించారు. ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు వివిధ సంస్థల్లో, కళాశాలల్లో, బ్యాంకుల్లో 28 అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. మహిళలు తమ పనిప్రదేశాల్లో ఎటువంటి వివక్షత వేధింపులకు గురైనా ఈ కమిటీకి ఫిర్యాదు చేయాలని సహాయం పొందాలని సూచించారు. ఎన్ని చట్టాలున్నా తగిన అవగాహన లేకపోతే వాటిని సమర్థవంతంగా వినియోగించుకోలేమని తెలిపారు. జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ భారతీయ న్యాయ సంహిత చట్టంలో మహిళలు, పిల్లలకు సంబంధించిన అధ్యాయంలో అంశాలను వివరిస్తూ హక్కులపై పూర్తిస్థాయి అవగాహన ఉన్నప్పుడే ఆత్మస్థైర్యం, సమస్యను ఎదుర్కోగలిగే నమ్మకం ఉంటుందన్నారు. మహిళలు, బాలికల హక్కులపై అవగాహన కల్పించేలా ఐసిడిఎస్‌తో పాటు ఇతర సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. బాధిత మహిళల సమాచారం ప్రసారమాధ్యమాల ద్వారా వెల్లడి కాకుండా జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. అనంతరం సన్యాసినాయుడిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు అజ్జాడ త్రినాథరావు, లావణ్య, లావేరు ఇఒపిఆర్డఇ విశ్వేశ్వరరావు, వైద్యాధికారులు కృష్ణచైతన్య, లలిత, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి సన్యాసినాయుడు

పలాస : పనిప్రదేశాల్లో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఒ లావణ్య హెచ్చరించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో లైంగిక వేధింపులు నిరోధక చట్టంపై శిక్షణ ఇచ్చారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో అపన్న హస్తం ఎదురు చూస్తున్న వారికి స్వచ్ఛందంగా సేవలందిస్తున్న లయన్స్‌క్లబ్ సెంట్రల్ ప్రతినిధులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రశంసించారు. కలెక్టరేట్‌లో లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, డాక్టర్ పైడి సిందూరల నేతృత్వంలో సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఉచిత ప్రజా ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిడం శుభ పరిణామమన్నారు. వ్యాపార దృక్పథం వీడి పేదల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలన్నారు. అన్నదానం, రక్తదానం, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించటం, వికలాంగులకు వీల్ చైర్స్ అందించటం, రోగుల కొరకు ఉచిత అంబులెన్స్ సేవలు ఎంతో ప్రయోజనంగా ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలతో విస్తృత పరచాలన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, డాక్టర్ బి.దేవభూషణరావు, రాంగోపాల్ పాల్గొన్నారు.


స్టీల్ సామగ్రిని అందజేస్తున్న సభ్యులు

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కుసుంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. అందులో భాగంగా విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, పాఠశాల దుస్తులు, షూష్ అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సురేష్ కుమార్, సర్పంచ్ ఊర్మిళా బిసాయ్, ఎంపిటిసి సత్యనారాయణ, కూటమి నాయకులు గున్నయ్య, ఎ.సురేష్‌కుమార్, చలపతి, బాబూరావు, శ్రీను, నవీన్, అన్నమయ్య పాల్గొన్నారు.

ఎఫ్‌పిఒలతో ఆర్థిక పరిపుష్టి


మాట్లాడుతున్న డిపిఎం నారాయణరావు

ప్రజాశక్తి- కవిటి

చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎఫ్‌పిఒలు ఏర్పాటు చేసినట్టు డిపిఎం నారాయణరావు తెలిపారు. కవిటి కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో కవిటికొత్తూరు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఫ్‌పిఒ సభ్యులకు జీవనోపాధులు కల్పించే క్రమంలో ప్రభుత్వం రాయితీపై వివిధ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా మండలంలో కొబ్బరి ప్రధాన పంట కావడంతో ఆసక్తి కలిగిన రైతులు దానికి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఎఫ్‌పిఒ తరుపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ఎఫ్‌పిఒ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, అప్పులు, వసూళ్లపై సమీక్షించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం కవిటి మహిళా సమాఖ్య భవనంలో విఒఎలతో సమావేశమై శతశాతం వసూళ్ల సాధించి, అర్హులకు పథకం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ ఎపిఎం ఈశ్వరరావు, ఎసి మోహనరావు, కవిటి ఎపిఎం గోవిందరావు, ఎఫ్‌పిఒ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్, సభ్యులు కీర్తిరావు, రంగారావు, రవికుమార్, నారాయణరావు, కుర్మారావు, మోహనరావు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

రాహుల్‌ను కలిసిన కృపారాణి


సన్మానిస్తున్న 'కిల్లి' దంపతులు

టెక్కలి : కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డాక్టర్ రామ్మోహనరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ గురించి విశదీకరించారు.


ఇబ్బందులు పడుతున్న చిన్నారులు

చిన్నారుల అవస్థలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ముక్తాపురం ప్రాథమిక పాఠశాల ముందు ఉన్న రోడ్డులో నీటి నిల్వలు ఉన్నారు. దీంతో పాఠశాలకు వెళ్లడానికి దారి లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం పాఠశాలకు వెళ్లడానికి ఉన్న ఏకైక రహదారి నీటితో నిండి ఉండడంతో.. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధితశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. వర్షాకాలం వస్తే ఇదే సమస్య ఎదురవుతుందని, గతంలో ఎంతోమంది నాయకుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని వాపోయారు.

27న రణస్థలం మండల సమావేశం


రణస్థలం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపిపి ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంలో మండల అధికారులు పాల్గొవాలన్నారు. మండల సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్ నోటీసులో పెడతానని తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


చంద్రశేఖర్ మృతదేహం

టెక్కలి గ్రామ సమీప జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు లంక చంద్రశేఖర్ (26) తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందారు. అక్కడ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందారు. మృతుడిది బూర్జ మంగలం పాలవలసకు చెందిన వారిగా పోలీసులు గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కాగువాడలో చోరీకి గురైన మోటారు

వ్యవసాయ మోటార్లు అపహరణ

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని కొరసవాడ, కాగువాడ, హిరమండలం మండలం ధనుపురం గ్రామాల్లో 15 వ్యవసాయ మోటార్లు దొంగిలించినట్లు ఆయా గ్రామాల రైతులు మంగళవారం తెలిపారు. పాతపట్నం మండలం కాగువాడకు చెందిన గణపతి ఆదినారాయణ, గణపతి మురళి అనే రైతులకు చెందిన టూ పేస్ మోటార్లు, కొరసవాడకు చెందిన బుగత తేజశ్వరరావు, కర్రి రామదాసు, అమర రవి, గణపతి, పాపినాయుడు, గణపతి, గురినాయుడు, మడ్డు అన్నంనాయుడులకు చెందిన మోటార్లు నెల రోజు క్రితం దొంగిలించారని తెలిపారు. దీనిపై ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.


నిలిచిన క్వారీ


గ్రానైట్ కార్మికుల ఆకలికేకలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

గ్రానైట్ కార్మికులకు క్వారీలో పనులు ఎన్నికల కౌంటింగ్ మరసటి రోజు నుంచి నిలుపుదల చేశారు. దీంతో కార్మికులు రోడ్డున పడ్డారు. సుమారు రెండు నెలలు కావస్తున్న క్వారీలు పనులు పున:ప్రారంభం కాలేదు. దీంతో కూలి చేస్తే కుండ ఆడే పరుస్తున్న కార్మికులు రోడ్డున పడుతున్నారు. ఎప్పటికీ తెరుస్తారో? తెలియని పరిస్థితిలో యాజమాన్యాలు ఉన్నాయి. అయితే తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు ఇళ్ల అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రానైట్ క్వారీ యాజమాన్యాలు కార్మికులు ప్రశ్నంచితుంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని యాజమాన్యాలు చెప్తున్నారని కార్మికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి క్వారీలు ప్రారంభించాలని కార్మికులు కోరుతున్నారు.

సిఎంని కలిసిన ఎంజిఆర్

ప్రజాశక్తి- పాతపట్నం


వినతిపత్రం అందజేస్తున్న ఎంజిఆర్

వెనుకబాటుకు గురైన పాతపట్నం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సిఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి అత్యధిక నిధులను మంజూరు చేయాలని విన్నవించారు. రైతుల పంటలకు అనువుగా ఉండేందుకు మహేంద్ర తనయ, వంశధార నదులపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మంజూరుకు సహకారం అందించాలని అన్నారు. రోడ్ల నిర్మాణానికి, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

గూనానపేటలో 'శిక్షా సప్తాష్'

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ గూనానపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గురుగుబెల్లి మధుబాబు ఆధ్వర్యాన మంగళవారం శిక్షా సప్తాష్ విద్యా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పునాది అక్షరాస్యత, సంఖ్యాభావనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాకపోకలు సాగేదెలా?

పొందూరు: రహదారి వర్షపునీరు నిలిచిపోయే రాకపోకలు సాగించేందుకు వీలులేకుండా కనిపిస్తున్న ఈ దృశ్యం మండలంలోని తోలాపి గ్రామంలోనిది. గ్రామంలోని ఎస్‌సి కాలనీకి పోయే ఈ రహదారిలో చిన్న పాటి వర్షం కురిస్తే చాలు నీరు నిలిచిపోయి రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి ఎత్తుగా ఉండడంతో వర్షపునీరు బయటకు పోయే మార్గం లేక ఇలాగే నిలిచిపోతున్నదని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ రహదారిపై మహిళలు, వృద్ధులు, చిన్నారులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తున్నదని వాపోయారు. అధికారులు డ్రై డే.. ఫ్రైడే అంటూ పారిశుధ్య కార్యక్రమాలపై ప్రచారమే తప్ప సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని ఆరోపిస్తున్నారు. వర్షా కాలం కావడంతో నీరు ఇలా నిలిచిపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

నిరాశపర్చిన బడ్జెట్

నరసన్నపేట : సిపిఎస్ విధానంలో మార్పులు తెస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంపై పళ్లెత్తి మాట బడ్జెట్లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించిందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ఇన్‌కం టాక్స్‌కు సంబంధించి పాతవిధానం కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువగా చెల్లించాల్సి రావడంతో ఉద్యోగులు పాత విధానానికి మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఈసారైనా పాత విధానంలో పన్నులు చెల్లించే వారికి రాయితీ ఇస్తారని అందరూ ఆశించారని అన్నారు. విద్యారంగానికి ఆరు శాతం కేటాయించాల్సి ఉండగా, 3.25 శాతం నిధులను మాత్రమే కేటాయించి ప్రభుత్వ విద్యారంగానికి ప్రాధాన్యత లేదన్నట్లు వ్యవహరించిందన్నారు. వచ్చే ఐదేళ్లలో నాలుగు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పగా చెబుతున్న ప్రభుత్వం గడచిన పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు సృష్టించిందో కనీసం ప్రస్తావన కూడా చేయలేదన్నారు. ద్రవ్యోల్బణం 4 శాతం శాతానికి తగ్గిందని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి చెప్పారని కానీ, దానికి అనుగుణంగా ధరలు తగ్గకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు.

కార్పొరేట్ల అనుకూల బడ్జెట్

పిసిసి కార్యదర్శి అన్నాజీరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ బడాబాబులకు దోచిపెట్టి పేదవాడిని దోచుకునేలా ఉందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. మంగళవారం 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఆంధ్రా రాజధాని అమరావతికి నిధులు ఇచ్చేశాం అంటూ టిడిపి కూటమి నేతలు ప్రగల్బాలు పలుకుతున్నారని అన్నారు. వాళ్లు ఇచ్చినవి నిధులు కాదు.. అప్పులని ఇచ్చిన అప్పులు కూడా గొప్పలుగా చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అప్పు అనేది ఏనాటికైనా మనం తిరిగి చెల్లించాల్సిం దేనని, దానికే మనకేదో ఇచ్చేశారు చేసేశారనుకోవడం దుర్మార్గమని అన్నారు. అలాగే ధనవంతుల ను పెంచి పేదవాడిని తొక్కే బడ్జెట్ ప్రవేశపెట్టారని, పేదవాడికి పనికి వచ్చే అంశం ఒక్కటీ లేకపోవడం బాధాకరమని అన్నారు.

ఐటిఐ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సిద్ధార్థ ఐటిఐ కరస్పాండెంట్ మొదలవలస రమేష్ అన్నారు. పట్టణంలోని గేటులో ఉన్న సిద్ధార్థ ఐటిఐలో 2022-24వ బ్యాచ్ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక విద్యలో నైపుణ్యాలను పెంచుకుంటూ ఉపాధి అవకాశాలను అందుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలతో పాటు ప్రతిఒక్కరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. కార్యక్రమానికి ఎంఇఒలు జి.రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర, ఐటిఐ కరస్పాండెంట్ కూన బానోజీరావు, కళాశాల ప్రిన్సిపాల్ పేడాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మహిళల ర్యాలీ

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లెమ్మ పంచాయతీ మహాసింగిలో పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా వెలుగు సిసి అరుణ్‌జ్యోతి ఆధ్వర్యాన పురవీధుల్లో మంగళవారం మహిళలు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. తాగునీటి కుళాయి, బోర్ల వద్ద దుస్తులు ఉతకరాదని అన్నారు. వాడుకనీరు రోడ్లపైకి విడిచిపెట్టరాదని సూచించారు. కార్యక్రమంలో కార్యకర్త జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి కదిలిన రైతు దండు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఐదేళ్లుగా వంశధార నీటి కోసం ఎదురు చూసి విసుగు చెందారు. సాగునీరు అందక వ్యవసాయం దండగ అనే పరిస్థితికి ఆ రైతులు వచ్చారు. సాగునీరు అందక ఐదేళ్లుగా పంటలు లేక ఆర్థికంగా నష్టపోయిన రైతులు క్రాప్ హాలీడేకి సిద్ధమయ్యారు. అయితే టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే వంశధార నీరు రావడంతో సాగుపై రైతులకు ఆశలు చిగురించాయి. సీతాపురానికి చెందిన రైతులు 60 ఆర్ఎల్ కాలువ పరిధిలోని 5 ఎల్ బెండి ఛానల్ లో మంగళవారం పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించి కాలువ శుభ్రం చేశారు. ప్రస్తుతం 60 ఆర్ఎల్ కాలువ ద్వారా పెద్దబొడ్డ పాడు, రామసాగరంలోకి నీరు చేరుతుంది. రామ సాగరం సాగునీరు పూర్తి నీటిమట్టం చేరుకున్న తరువాత బుధవారం నుంచి సీతాపురం ఎర్ర చెరువులోకి నీరు విడిచి పెట్టనున్నారు. ప్రతి చేనుకూ నీరు, ప్రతి చేతికీ పని నినాదంతో అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే శిరీషకు రైతులు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలోసర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు తమ్మినాన అప్పారావు, ఉప్పాడ కృష్ణారావు, తమ్మినాన బాలకృష్ణ, టి.గోపాలరావు, హనుమంతు గోపాలకృష్ణ, టి.రామయ్య, గొల్లపల్లి ధర్మారావు, డి.తిరుపతిరావు, రోణంకి గిరిబాబు, టి.సరోజిని, యదళ్ల రాజారావు, డి.నందయ్య, టి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


పిచ్చిమొక్కలను తొలగిస్తున్న రైతులు

గ్రంథాలయానికి స్థలం అప్పగింత


బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మెట్టూరు బిట్-2 పంచాయతీ యూత్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు గ్రంథాలయానికి స్థలం కావాలని ఇటీవల ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందించి గ్రామంలో సర్వే నంబరు 334-2 నేరడి రెవెన్యూలో 8 సెంట్లు స్థలాన్ని గ్రంథాలయ నిర్మాణానికి కేటాయించారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ అధీనంలోకి తీసుకున్నామని అసోసియేసన్ సభ్యులు బసవ రాంబాబు, సెక్రటరీ సూరయ్య తెలిపారు. ఈ మేరకు విఆర్ఒ వజ్జ బాలకృష్ణ, సర్వేయర్ రంజిత్‌కుమార్ స్థలాన్ని పరిశీలించి కొలతలు వేశారు. సభ్యులు స్థలంలో ప్లెక్సీ ఏర్పాటు చేశారు. స్థలం కేటాయించడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాద్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గవర మోహన్, సై ప్రశాంత్ కుమార్, గవర బాగ్యరాజు పాల్గొన్నారు.


మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

హెల్త్ సెంటర్‌ని అప్‌గ్రేడ్ చేయాలి

రణస్థలం రూరల్ : మండలంలోని కొండములగాంలో ఉన్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు మంత్రి క్యాంప్ కార్యాలయం లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యాకుమార్ యాదవ్‌ని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో శస్త్ర చికిత్సల కోసం జిల్లా కేంద్రాలకు రోగులు తరలివెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పష్టమైన హామీ ఇచ్చాని అన్నారు. ఎమ్మెల్యే వెంట సిహెచ్‌సి మాజీ చైర్మన్ వెలిచేటి సురేష్‌కుమార్, ఎంపిటిసి మాజీ సభ్యులు గురాల రఘునాథ్, శివ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ద్విచక్రవాహనం నడిపిన వారు, వెనుక కూర్చోన్న ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. ఈ మేరకు కోటబొమ్మాళి మెయిన్ రోడ్డులో న్యాయవాదులతో కలిసి మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శిరస్త్రాణం స్వీయ రక్షణకు, కుటుంబ శ్రేయస్సుకు ముఖ్య సాధనమని అన్నారు. అందుకు ప్రతి వాహనదారుడూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షులు లకినేని శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు నారాయణరావు, కార్యదర్శి తిరుమలరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాజారావు

ఆధార్ డ్రైవ్ పరిశీలన

నందిగాం : మండలంలోని లఖిదాస్‌పురం, హరిదాసుపురం సచివాయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ఎంపిడిఒ టి.రాజారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ 0-5 సంవత్సరాల లోపు పిల్లలు ఆధార్ చేయించుకోవాలన్నారు. అలాగే చేర్పులు, మార్పులు కూడా చేయించుకోవాలన్నారు.

లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే


లోకేష్‌తో రమణమూర్తి

పోలాకి : వెలగపూడిలోని ఎపి సచివాలయంలో రాష్ట్ర మానవ వనరులు, ఐటి, ఎలక్ట్రానిక్‌శాఖ మంత్రి నారా లోకేష్‌ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గంలో సమస్యలను వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి అన్నివిధాలుగా సహకరించాలని కోరారు. మంత్రి లోకేష్ కూడా సానుకూలంగా స్పందించి తగు సహాయం చేస్తానని మాట ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.


పరిశీలిస్తున్న విద్యార్థులు

వంశధార ప్రాజెక్టు సందర్శన

ప్రజాశక్తి- ఆమదాలవలస
మండలంలోని తొగరాం ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల వంశధార ప్రాజెక్టును క్షేత్రాన్ని మంగళవారం సందర్శించారు. ఇరిగేషన్ అధికారుల సమక్షంలో నేరడి, హిరమండలం ప్రాంతాలను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వంశధార డిఇలు గాయత్రీచంద్ర కుమార్, భవానీశంకర్, ఎఇలు జగదీష్‌బాబు, సాయి దీక్షిత్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పొన్నాడ సీతారాం పాల్గొన్నారు.


జాహ్నవిని సన్మానిస్తున్న సభ్యులు

విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి
మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన మండలంలోని పదో తరగతి ప్రథమ స్థానంలో నిలిచిన బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జవ్వాది జాహ్నవికి మంగళవారం సన్మానించారు. అనంతరం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు చిన్నవాడు, అర్జునుడు, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, మనబడి ప్రతినిధులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, జగదీష్ పాల్గొన్నారు.


పశువులకు టీకా వేస్తున్న రఘునాథ్

పశువులకు టీకాలు

టెక్కలి రూరల్ : నాలుగు నెలలు దాటిన పశువులకు ముద్ద చర్మపు వ్యాధి, (లంపిస్కిన్ డిసీస్) వ్యాక్సినేషన్స్ వేస్తున్నామని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.రఘునాథ్ తెలిపారు. మండలంలోని సుమారు 45 పశువులకు లంపిస్కిన్ డిసీస్ టీకాలు మంగళవారం వేశామన్నారు. పశువుల చర్మంపై పొక్కులు, ముఖంపై, నోటిలో, గొంతులో కూడా అలాగే ఒళ్లంతా కణితులు, పెద్దపెద్ద కాయలు మాదిరిగా వ్యాప్తి చెంది పశువు ఆహారం తీసుకోకపోవడం, పాల దిగుబడి తగ్గి, ప్రాణహాని సంభవించే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో కె.కొత్తూరు పశువైద్యాధికారి జనక్ చక్రవర్తి, ఎల్ఎసిఎ రమణ, కొండలరావు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

పాతపట్నం : పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారి ఆవేటి వారాలు మంగళవారం అంబరాన్నంటాయి. పట్టణం, చుట్టుపక్కల గ్రామాల యాత్రికులు ముగ్రాటలతో, ఘటాలతో మంగళ వాయిద్య ధ్వనులతో అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే సిసి కెమెరాలను పెట్టారు. ఆలయానికి కమిటీ సభ్యులు విద్యుత్ అలంకరణ చేపట్టారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


ఆస్పత్రిని పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- పలాస
సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, జ్వరాలు, డయోరియా కేసులకు సంబంధించి పలాస ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జి.వి.రాజ్యలక్ష్మి సూపరింటెండెంట్ డాక్టర్ పాపినాయుడును ఆదేశించారు. మంగళవారం పలాస ప్రభుత్వాస్పత్రిని సందర్శించి అన్ని వార్డులను తనిఖీ చేశారు. వార్డులు పరిశుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రిలో పారిశుధ్యం లోపించినట్టు తాను గుర్తించానని, వైద్యుల మధ్య సమన్వయం లోపించినట్లు గ్రహించానని అన్నారు. సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్‌లో ఇటువంటి ఆరోపణలు రాకుండా సిబ్బందిని గాడిలో పెడతానని అన్నారు. ఆస్పత్రిలో మత్తు వైద్యుడు లేరని విలేకరులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా... త్వరలో నియమించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం విడివిడిగా వైద్యులు, సిబ్బందిని విచారణ చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగు


నాట్లు వేస్తున్న కూలీలు

ప్రజాశక్తి ఆమదాలవలస
మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా సిబ్బంది ఖరీఫ్ సీజన్ మొదటి నుంచీ రైతులతో ముఖ్యంగా వరి సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ వరి సాగు చేపట్టారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరిస్తూ పూర్తిగా నాట్లు వేసి నుంచి మరలా పంట కోత వరకు ఏ విధమైన ప్రకృతి సేద్య విధానం చేపట్టాలి, అలాగే దిగుబడి పెంచేందుకు పాటించాల్సిన సస్యరక్షణ పద్ధతుల గురించి రైతులతో క్షేత్రస్థాయిలో కలిసి పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్ టు డిజిటల్ అసిస్టెంట్ సురేష్ మాట్లాడుతూ మంగళవారం చేపేనపేట, నిమ్మతొర్లువాడ గ్రామాల్లో పదెకరాల విస్తీర్ణంలో వరుస క్రమంలో వరి నాట్లను వేయించామన్నారు. ఈ విధంగా రోజు క్షేత్రస్థాయిలో రైతులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ఎక్కువ విస్తీర్ణంలో లైన్ షోయింగ్ విధానంలో వరి సాగును చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిరంజీవి, సురేష్, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ పరిశీలన


పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ఉదయలక్ష్మి

ప్రజాశక్తి- పొందూరు
పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ప్రథమ సంవత్సరంలో మేజర్ సబ్జెక్టుగా బోధిస్తున్న కంప్యూటర్ సైన్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.ఉదయలక్ష్మి అన్నారు. ఈ మేరకు కంప్యూటర్ ల్యాబ్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్‌ను విద్యార్థులు అభ్యసించడం వల్ల భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. కంప్యూటర్ సైన్స్‌పై విద్యార్థులకు శిక్షణను అందించేందుకు నూతనంగా పది కంప్యూటర్లను అందుబాటులో తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈమెతో పాటు అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

అర్హులందరికీ షాపులు

కోటబొమ్మాళి: వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు పాత చేపల మార్కెట్ ఎదురుగా షాపులు నిర్మించి అర్హులందరికీ అందజేస్తామని టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ అన్నారు. రాష్ట్ర కళింగ వైశ్య అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, టిడిపి నాయకులతో కలిసి షాపులు నిర్మాణాలకు మంగళవారం కొలతలు వేశారు. షాపుల పొడవు, వెడల్పులు తదితర అంశాలను పంచాయతీ రాజ్ ఇఇ ఎ.సూర్యప్రకాష్, ఎఇఇ కె.రంజిత్‌కుమార్, ఎఇ విష్ణుప్రియలతో చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింతాడ శ్రీనివాస్, కోటబొమ్మాళి టౌన్ ప్రెసిడెంట్ కోరాడ పెద్ద గోవింద్, మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ, తంగుడు కృష్ణస్వామి, ఎస్.రాంకుమార్, చిన్న గోవింద పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


టమోటా పంటను పరిశీలిస్తున్న హరికుమార్

ఆమదాలవలస : వర్షాల కారణంగా ఉద్యానవన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్ తెలిపారు. మండలంలోని నందగిరిపేటలో కూరగాయల క్షేత్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరటి తోటలో నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటకు వెళ్లేలా చేయాలన్నారు. తోట ఆరేలా చేసి ఒక్కో చెట్టుకు వంద గ్రాములు యూరియా, 80 గ్రాముల పొటాష్ ఎరువులను వేయాన్నారు. సిగటోక ఆకు మచ్చ తెగులను అరికట్టుటకు ప్రొపికోనాజోల్ మిల్లీలీటర్, మాంకోజేబ్ 2.5 గ్రాముల లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో ఒకటి, రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. మొక్క మొదళ్ల వద్ద నీటిని తీసివేయాలని సూచించారు. రెండు రోజులు వరకు నీరు నిల్వ తోటల్లో ఆకులు పసుపు రంగుకు మారుతున్నట్లయితే మెటవాక్సిల్ ఎం.జెడ్ మూడు గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కూరగాయలు పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తీసివేయాలి. నీరు నిల్వ ఉంటే వేరు కుళ్లిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. నీటిని బయటకు పంపించి మూడు గ్రాములకు కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి నారుమడులపై, మొక్కల మొదల వద్ద పోయాలని సూచించారు.


మొక్కలను నాటుతున్న తవిటినాయుడు

విరివిగా మొక్కలు నాటాలి

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అధ్యక్షతన జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన స్వచ్ఛ భారత్, వనమహోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి శివ్వాల తవిటినాయుడు పాల్గొని కళాశాల ఆవరణలో సీతాఫలం మొక్కలు నాటారు. విద్యార్థులు, సిబ్బంది అందరూ మొక్కలు సంరక్షణ చేపట్టాలని సూచించారు. కళాశాలలో స్వచ్ఛ భారత్ నిర్వహించామని, పిచ్చి మొక్కలు తొలగించామని ఎన్ఎస్ఎస్ పిఒ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో డివిఇఒ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఢిల్లీరావు, అధ్యాపకులు నాగేంద్ర, ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, విజయ, వినోద్‌రాజు, సంగీత, గౌతమి, బోటనీ విజయ్ పాల్గొన్నారు.


నేత్రాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం

ప్రజాశక్తి- పొందూరు
విద్యార్థులు తమ వ్యక్తిగత ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని లయన్స్‌క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ డాక్టర్ వై.మల్లిబాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన విద్యార్థులు మంగళవారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు వైద్యాధికారులు 420 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 25 మందికి దృష్టిలోపాలు ఉన్నట్టు గుర్తించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎ.కళ్యాణి, ప్రతినిధులు వి.సూర్యనారాయణ, ఎ.ధర్మారావు, జి.వి.ఎల్.కుమార్, వై.అనురాధ, హెచ్ఎం వెంకటరావు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అవసరమని జూనియర్ ఛాంబర్స్ జోన్ ట్రైనర్ దూసి సంతోష్ అన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సత్యసాయి పాఠశాలలో విద్యార్థులకు జెసిఐ వ్యక్తిత్వ వికాస వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. తోటివారిని, తల్లితండ్రులను, గురువులను, పెద్దలను గౌరవించాలన్నారు. చదువుతోపాటు, క్రీడల్లోను, సాంస్కృతిక రంగంలోను రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆశాలత, డైరెక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

పిల్లలవలసలో గ్రామసభ

పొందూరు: మండలంలోని పిల్లలవలస పంచాయతీలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు అధ్యక్షతన మంగళవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో నిర్వహించనున్న పారిశుధ్యం, క్లోరినేషన్, వీధిదీపాలు, రహదారులు, తాగునీరు వంటి పలు విషయాలపై చర్చించారు. సమావేశంలో ఉపసర్పంచ్ జి.కృష్ణమూర్తి, కార్యదర్శి కృష్ణవేణి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ పోలినాయుడు